RNI NO Tel / 2012/4241

# హైదరాబాద్ ఎస్టేట్

THE LARGEST CIRCULATED TELUGU NEWS PA

hyderabadestate.co.in

సంపుటి : 13 | సంచిక : 302 | బుధవారం 29 -4-2026 | ఎడిటర్ : బిట్టు లక్ష్మీనారాయణ | పేజీలు : 06 | వెల : 5-00

Hyderabad, Vijayawada,vishakaptnam,Tirupathi,Ananthapuram,Guntur,Ongole, Kadapa,Medak Sangareddy,Siddipet, Nalgonda,Karimnagar



## గూగుల్ తో మారనున్న విశాఖ ముఖచిత్రం

2లో

సరికొత్త చరిత్రకు నాంది పలికాం

గూగుల్ సెటంర్ కార్యక్రమంలో లోకేశం



## సింగరేణిని పదేళ్లలో దోచేశారు

- ఎటిఎంలా వాడుకుని వదిలేశారు
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దివాళా తయించారు
- కెసిఆర్ తీరుపై మండిపడ్డ మంత్రి వివేక్

2లో



## ఆక్వాకల్చర్‌కు అండగా కూటమి ప్రభుత్వం

- డీజిల్ సరఫరాలో ఎటువంటి అంతరాయం ఉండదు
- జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు నిరంతర పర్యవేక్షణ
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

# ఫ్యూచర్ కోసమే... సిటీ నిర్మాణం

మిగతా 2లో



- ప్రపంచ దేశాలకు ధీటుగా నగర ప్రణాళిక
- 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం
- ఓఆర్ఆర్ పెద్ద అసెట్ కానుంది అంతర్జాతీయ స్థాయి బస్ టెర్మినల్
- మెట్రో విస్తరణతో అద్భుత కనెక్టివిటీ
- గ్రామాల ప్రజలు సిటీలో భాగం కావాలి
- ప్రజాప్రతినధులు సిటీ కోసం కృషి చేయాలి
- మూడు బుల్లెట్ ట్రైన్స్ కేంద్రంగా శంషాబాద్
- ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ నిర్మాణానికి సిఎం రేవంత్ శంకుస్థాపన

హైదరాబాద్,హైదరాబాద్ ఎస్టేట్

ఫ్యూచర్ సిటీ భవిష్యత్ తరాలకు వరమని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందరి కృషితోనే ఫ్యూచర్ సిటీ నిర్మాణం జరుగుతోందని తెలిపారు. ఈ సిటీ నిర్మాణం అంత సులభం కాదన్నారు. అయితే పక్కా ప్రణాళికతో ప్రపంచ నగరాలకు దీటుగా నిర్మించబోతున్నామని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసే నగ రంలో తమనూ కలపాలని స్థానిక గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారని వెల్లడించారు. ప్రజల్ని అభివృ ద్ధిలో భాగస్వాములు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రేవంత్ చెప్పుకొచ్చారు. రంగారెడ్డి జిల్లా మీర్ఖాన్‌పేట్‌లో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ భవన నిర్మాణానికి ముఖ్య మంత్రి రేవంత్ శంకుస్థాపన చేశారు. అలాగే పలు అభివృద్ధి పనులను ప్రారంభి ంచారు. మల్కాజ్‌గిరి కమిషనరేట్ భవనం, ఆక్టోపస్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, కుత్బుల్లాపూర్ డీసీపీ కార్యాలయాలను ప్రారంభించారు. గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికీ సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో చాలా మంది నేతలు హైదరాబాద్ అభివృ ద్ధిని కొనసాగిం చారని చెప్పారు. ఇప్పుడు నాలుగో నగరం గా భారత్ ఫ్యూచర్ సిటీ రూపుదిదు ద్దకుంటోందని పేర్కొన్నారు. జపాన్, జర్మనీ, సింగపూర్ వంటి దేశాల్లోని అత్యాధునిక నగరాల తరహాలో, భారత్‌లోనే నాలుగో నగరంగా దీన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. 60 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నిర్మాణం జరుగుతోందన్నారు. మనకున్న అద్భుతమైన ఆర్ఆర్ఆర్, ఐటీ ఎగుమతులు, కోవిడ్ వ్యాక్సిన్ తయారీలో మన ఘనతలే ఈ నగరానికి స్ఫూర్తి అని తెలిపారు.



## తెలంగాణలో పెరిగిన ఎండల తీవ్రత

- ఇప్పటికే వడదెబ్బకు ముగ్గురు మృతి
- దేశవ్యాప్తంగా కొనసాగుతున్న హీట్‌వేవ్
- భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం

న్యూఢిల్లీ,హైదరాబాద్ ఎస్టేట్

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోల మార్ఫింగ్ కేసులో మాజీ సీఎం జగన్ సీపీఆర్‌వోగా పని చేసిన పూడి శ్రీహరికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు, మధ్యంతర ఉపశమనం కలిగించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. ఈ కేసులో పూడి శ్రీహరిని రిమాండ్‌కు అప్పగించాలంటూ గతంలో పోలీసులు కుప్పం ట్రయల్

- మిగతా 2లో

## ప్రపంచానికి సవాల్‌గా మారిన ఉగ్రవాదం

ఉగ్రవాదానికి ఊతమిచ్చే దేశాలను తిప్పికొట్టాలి

షాంఘై సహకార రక్షణ మంత్రుల సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్






## సిసి కెమరాలను సైతం హ్యాక్ చేస్తున్నారు

అలాంటి పోలీస్ అధికారులను వదలం

మాజీమంత్రి హరీష్ రావు హెచ్చరిక



సంగారెడ్డి,హైదరాబాద్ ఎస్టేట్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ మూర్ఖత్వం.. హిట్లర్‌ను మించిపోయిందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌పై దాడి కేసులో జైల్లో ఉన్న బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ మన్నే క్రిశాంక్‌ను హరీశ్ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొంత మంది ఐపీఎస్‌లు తమ ఫోన్‌లను.. ఇంటి ముందున్న సిసి కెమెరాలను హ్యాక్ చేస్తున్నారని ఆరోపించారు. బెంగళూరు నుంచి హ్యాకర్లను

మిగతా 2లో

## నేడు తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల




హైదరాబాద్,ఏప్రిల్ 28: తెలంగాణలో పదో తరగతి పరీక్షా ఫలితాల విడుదలకు ముహూర్తం ఖరారైంది. బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలు వెల్లడించనున్నట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం వెల్లడించింది. ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు ఫలితాలను విడుదల చేయనున్నట్లు సమాచారం. మార్చి 14 నుంచి ప్రారంభమైన ప్రధాన పరీక్షలు ఈ నెల 13న పూర్తయ్యాయి. మే మొదటి వారంలో ఫలితాలు విడుదల చేస్తామని ముందు నుంచి చెబుతున్నా... తాజాగా ఈనెల 29న విడుదల చేసేందుకు రంగం సిద్ధమైంది.

# ఫ్యూచర్ కోసమే...సిటీ నిర్మాణం

ఫ్యూచర్ సిటీ కోసం భూములిచ్చిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. ఈ నగర నిర్మాణానికి సహకరించే వారు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. వచ్చే జూన్ నెలలో ఫ్యూచర్ సిటీ కార్యాలయాన్ని ప్రారంభించబోతున్నామని తెలిపారు. సిటీ నిర్మాణానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని.. ప్రపంచంతో పోటీపడేలా నిర్మిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూన్ 2వ తేదీ లోపు ఫ్యూచర్ సిటీ భవన నిర్మాణం జరుగుతుందన్నారు. గతంలో హైటెక్ సిటీ అంటే అవహేళన చేశారని.. ఏ నగరానికీ లేని ఔటర్ రింగ్ రోడ్డు హైదరాబాద్‌కు ఉందన్నారు. మూడు కొవిడ్ వ్యాక్సిన్లు తెలంగాణలోనే ఉత్పత్తి అయ్యాయని గుర్తు చేశారు. యుద్ధ విమాన సర్వీస్ సెంటర్లూ హైదరాబాద్‌లో ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచంతో పోటీపడేటా ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీ కేవలం ఒక నగరం కాదు, ఇది రాబోయే తరాల తలరాతను మార్చే అద్భుతమన్నారు. ఈ నగర నిర్మాణం అంత సులభం కాదు. ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ఇది సాధ్యమవుతుంది. ఫ్యూచర్ సిటీలో కలవాలనుకునే గ్రామాలు... గ్రామ సభల్లో తీర్మానం చేసి ముందుకు రావాలని సీఎం పిలుపునిచ్చారు. ప్రజా ప్రతినిధులు ఫ్యూచర్‌సిటీ అభివృద్ధిలో




భాగస్వాములు కావాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. భవిష్యత్ తరాలకు అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ విలసిల్లుతుందన్నారు. ఫ్యూచర్ సిటీ పరిధి గ్రామాల సర్పంచ్‌ల వివరాలు తెప్పించుకోవాలి. తమ గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఆయా గ్రామాల్లో సభలు పెట్టి తీర్మానాలు చేసి.. కలెక్టర్, మంత్రికి పంపాలి. ఆయా గ్రామాలను ఫ్యూచర్ సిటీలో భాగం చేసే చర్యలు చేపడతాం. ఆదర్శ నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దుతాం అని సీఎం అన్నారు. ఇకపోతే కేంద్రం దేశవ్యాప్తంగా ఏడు బులెట్ ట్రైన్లను ప్రకటిస్తే.. అందులో మూడు మన రాష్ట్రానికే రాబోతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శంషాబాద్ కేంద్రంగా ముంబై, బెంగళూరు, అమరావతి నగరాలను అనుసంధానిస్తూ బులెట్ రైళు పరుగులు తీయబోతున్నాయని చెప్పారు. కేవలం రైళ్లే కాదు.. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో భారీ బస్సు టెర్మినల్‌ను కూడా మనం నిర్మించుకోబోతున్నామని రేవంత్ తెలిపారు.

మెట్రో, బులెట్ ట్రైన్, అత్యాధునిక బస్ టెర్మినల్.. ఇవన్నీ ఒకే చోట ఏర్పాటు కాబోతున్నాయన్నారు. త్వరలోనే రంగారెడ్డి జిల్లా ఒక మహా అద్భుతానికి సాక్ష్యం కాబోతోందని చెప్పారు. తాను కూడా ఈ గడ్డ నుండే ఊరికి వెళ్తాను.. అందుకే మీపై ఉన్న అభిమానంతో, ఈ ప్రాంత భవిష్యత్తు కోసం అద్భుతమైన ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. ఫ్యూచర్ లేనివాడు ఫ్యూచర్ సిటీ అంటున్నాడని కొందరు అంటున్నారు... నా మీద ఏడ్చే వారికి నేను చెప్పేది ఒక్కటే.. మీరు ఏడ్చుకుంటూనే ఉండండి, నేను నా పని చేసుకుంటూనే పోతా.. మీ ఏడుపే నా చెవులకు వినిపించే మధుర సంగీతం అని రేవంత్ అన్నారు.

# కవిత ప్రశ్నలకు ఎందుకు సమాధానం ఇవ్వలే

చేసిన వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల కోసం గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఏడాదికి రూ.2,800 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. వరిసాగు విస్తీర్ణంలో తెలంగాణ ఇవాళ పంజాబ్‌ను అధిగమించింది. ఈ సీజన్‌లో కూడా 8వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం నడుపుతోందన్నారు. మసిపూసి మారేడుకాయ చేయడం బీఆర్ఎస్ నేతలకు అలవాటు. ధాన్యానికి బోనస్‌గా రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.3 వేల కోట్లు వేశాం. వరికి బోనస్ ఇవ్వాలనే ఆలోచన కేసీఆర్‌కు ఎప్పుడైనా వచ్చిందా అని ఆది శ్రీనివాస్ ప్రశ్నించారు. కేసీఆర్ ఒక్క రైతుబంధు అమలు చేసి అన్ని పథకాలు నిలిపివేశారు. పంట నష్ట పరిహారం, వ్యవసాయ పరికరాలకు సబ్సిడీ ఆపేశారు. ఈ ప్రభుత్వం రైతు భరోసాతోపాటు గతంలోని పథకాలను అమలు చేస్తోంది. బీఆర్ఎస్ ఎందుకు ఓడిపోయిందో.. పోస్టుమార్టం చేసుకోవట్లేదు. ఆ పార్టీ నేతలు అహంకార ధోరణిలో ఇంకా ప్రజలనే తప్పుపడుతున్నారని ఆది శ్రీనివాస్ విమర్శించారు. చేసిన తప్పులను కెసిఆర్ కూతరు కవితే బయట పెట్టారని అన్నారు. కాళేశ్వరం సహా అనేక విషయాల్లో సంధించిన ప్రశ్నలకు కెసిఆర్ సమాధానం చెప్పివుంటే హుందాగా ఉండేదని అన్నారు.

# సింగరేణిని పదేళ్లలో దోచేశారు

మంచిర్యాల,ఏప్రిల్28( గత పదేళ్లలో సింగరేణి సంస్థను కేవలం ఒక ఏటీఎంలా వాడుకున్నారే తప్ప, కార్మికుల శ్రేయస్సును పట్టించుకోలేదని బిఆర్ఎస్ పాలకులపై మంత్రి వివేక్ మండిపడ్డారు. కొత్త గనుల కేటాయింపులో బీఆర్ఎస్ వైఫల్యం చెందిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సింగరేణిని గాడిన పెడుతున్నామని.. నేరుగా వేలంలో పాల్గొని కొత్త బొగ్గు గనులను దక్కించు కుంటున్నామని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌పై నిప్పులు చెరిగారు. తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడమే కాకుండా, సింగరేణిని ఏటీఎంలా వాడుకున్నారని ధ్వజమెత్తారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో మీడియాతో మాట్లాడిన ఆయన.. రూ. 60 వేల కోట్ల అప్పుగా ఉన్న తెలంగాణను.. 8 లక్షల కోట్ల అప్పుల రాష్ట్రంగా మార్చిన ఘనత కేసీఆర్‌దేనని వివేక్ విమర్శించారు. ఇందులో భాగంగానే రామకృష్ణ పూర్ ఓపెన్ కాస్ట్ ఫేజ్-2 మైన్ మంజూరైన విషయాన్ని గుర్తుచేశారు. నాడు సింగరేణికి రావాల్సిన 25 వేల కోట్ల బకాయిలపై నోరు మెదపని కార్మిక సంఘాలు.. నేడు నెలకు 10 కోట్లు ఖర్చు చేస్తూ సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మంత్రి మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఒక అట్టర్ ఎ÷-లాప్ అని.. అందులో జరిగిన అవినీతిపై విచారణ జరిపించాల్సిన బాధ్యత కేంద్రానిదేనని స్పష్టం చేశారు. గతంలో నడ్డా, అమిత్ షా వంటి వారు అవినీతి జరిగిందని ఆరోపించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

# ఆక్వాకల్చర్‌కు అండగా కూటమి ప్రభుత్వం

అమరావతి, భీమోదయం: ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వాకల్చర్ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,34,617 హెక్టార్లలో ఆక్వాకల్చర్ సాగు జరుగుతోందని, అందులో 1,21,829 హెక్టార్లలో చేపల పెంపకం, 1,12,788 హెక్టార్లలో ఉప్పునీటి సాగు జరుగుతోందని పేర్కొన్నారు. శ్రింప్, సీ బాస్ వంటి వాణిజ్య పంటలు సాగు చేస్తున్న సుమారు 1.2 లక్షల హెక్టార్లకు 24 గంటల నిరంతర విద్యుత్ అవసరం ఉందని మంత్రి తెలిపారు. విద్యుత్ అంతరాయం ఉన్న సమయంలో రైతులు డీజిల్ జనరేటర్లపై ఆధారపడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం రోజుకు సగటున 2 గంటల విద్యుత్ కోత ఉన్నట్లు అంచనా వేస్తూ, ఒక హెక్టారుకు రోజుకు సుమారు 5 లీటర్ల డీజిల్ అవసరం అవుతోందని వివరించారు. వారానికి ఒక హెక్టారుకు 40 లీటర్ల డీజిల్ అవసరం కాగా, మొత్తం 1.2 లక్షల హెక్టార్లకు వారానికి సుమారు 5000 కిలోలీటర్ల డీజిల్ అవసరం ఉంటుందని తెలిపారు.

**డీజిల్ సరఫరా పర్యవేక్షణలో కట్టుదిట్టమైన చర్యలు..**

ఆక్వాకల్చర్ రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా డీజిల్ సరఫరాను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. జిల్లాల వారీగా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు ప్రత్యేకంగా పరిస్థితిని సమీక్షిస్తూ, డీజిల్ అందుబాటును పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. జిల్లా మత్స్యశాఖ అధికారుల సహకారంతో ప్రతి ప్రాంతంలో సమన్వయం కొనసాగుతోందని చెప్పారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ వారి పక్షాన నిలబడి, అవసరమైన మద్దతు అందిస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. ఆక్వాకల్చర్ రంగ అభివృద్ధికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు.

# గూగుల్ ..ఎపికి గేమ్ ఛేంజర్

కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం అందుకు అంగీకరించలేదు. దీంతో పోలీసులు హైకోర్టును ఆశ్రయించగా.. కుప్పం కోర్టు ఆదేశాలను తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ.. విచారణకు సహకరించాలని పూడి శ్రీహరిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం కుప్పం కోర్టు ఆదేశాలను తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు నిరాకరించింది.

## సిసి కెమరాలను సైతం హ్యాక్ చేస్తున్నారు

తీసుకొచ్చి తమపై నిఘా పెడుతున్నారన్నారు. 'అలాంటి అధికారులు జాగ్రత్త.. మీరు రిటైర్డ్ అయినా మిమ్మల్ని వదలం' అని హెచ్చరించారు. మన్నే క్రిశాంక్‌తో పాటు ఏడుగురిపై అక్రమ కేసు పెట్టారని మాజీ మంత్రి మండిపడ్డారు. ప్రశ్నించే వారిపై కాంగ్రెస్ అక్రమ కేసులు పెడుతోందని ఆరోపించారు. రైతులు, రాష్ట్ర ప్రజల పట్ల కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. ఎవరు మాట్లాడితే వాళ్లపై కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీపై అక్రమ పోస్టులు పెడుతున్నారని పోలీసులకు క్రిశాంక్ ఫిర్యాదు చేశారని తెలిపారు.

కాంగ్రెస్ వాళ్లపై కేసులు పెట్టాల్సింది పోయి ఫిర్యాదు చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు పెట్టారని మండిపడ్డారు. నాన్ బెయిలబుల్ కేసు ఎలా పెడతారని ప్రశ్నించారు. బెయిల్ ఇవ్వాల్సిన కేసును పాత కేసులు చూపెట్టి జైల్లో వేశారని ఆరోపించారు. ప్రభుత్వ అరాచకాలను ప్రశ్నిస్తే కేసు పెడతారా అని మాజీ

## పార్లమెంటులో ఏం జరుగుతుందో తెలుసుకో

### కెసిఆర్‌కు ఎంపి మల్లు రవి చురకలు



హైదరాబాద్,ఏప్రిల్28 పార్లమెం టులో ఏం జరుగుతుందో తెలుసుకు ని మాట్లాడితే బాగుండేదని బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌పై టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి మరోసారి మండిపడ్డారు. మంగళవారం హైదరాబాద్‌లో మల్లు రవి విలేకర్లతో మాట్లాడుతూ.. ఫాం హౌస్‌లో ఉండే కేసీఆర్‌కు పార్లమెంట్‌లో ఏం జరుగుతుందో తెలియనట్లు ఉందన్నారు. వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలంటూ కేసీఆర్‌కు ఆయన హితవు పలికారు. బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య క్షమాపణలు చెప్పాలని తాము వెంటనే పార్లమెంట్‌లో డిమాండ్ చేశామని ఈ సందర్భంగా మల్లు రవి గుర్తు చేశారు. అలాగే పార్లమెంట్ బయట కూడా కాంగ్రెస్ ఎంపిలు ఆందోళన చేశారని అన్నారు. ఇవన్నీ బిఆర్ఎస్ నేతలకు తెలియవా అన్నారు. పార్లమెంట్‌లో తేజస్వీ వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించిందన్నారు. కాంగ్రెస్ నేతలపై కేసీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేయడం సరికాదని ఆయన సూచించారు.

## తెలంగాణలో పెరిగిన ఎండల తీవ్రత

హైదరాబాద్,ఏప్రిల్28 తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో బయటకు రావడం కష్టంగా మారింది. తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండల తీవ్రత కారణంగా తెలంగాణలో విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. వడదెబ్బతో ముగ్గురు మృతి చెందగా, పిడుగుపాటుకు ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇకపోతే దేశవ్యాప్తంగా హీట్‌వేవ్ కొనసాగుతున్నది. ఎండలు దంచికొడుతున్నాయి. చాలా చోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి, కొన్ని చోట్ల వరుసగా గత కొన్ని రోజుల నుంచి ఎండ తీవ్రత 40 డిగ్రీలు దాటుతోంది. అయితే అదే స్థాయిలో విద్యుత్తు వినియోగం కూడా జరుగుతున్నది. సోమవారం ఒక్క రోజే దేశవ్యాప్తంగా గరిష్టంగా 255.85 గిగావాట్ల విద్యుత్తును వినియోగించినట్లు ప్రభుత్వం పేర్కొన్నది.

## ప్రపంచానికి సవాల్‌గా మారిన ఉగ్రవాదం



న్యూఢిల్లీ,ఏప్రిల్28

ఉగ్రవాదమే ప్రపంచానికి ప్రధాన ముప్పుగా మారిందని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. తీవ్రవాదం, ఉగ్రవాదంతో పలు సమస్యలు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ఉగ్రవాదం పై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించే దేశాలు అందుకు తగిన పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. కిర్గిస్థాన్ లో జరిగిన షాంఘై సహకార సంస్థ రక్షణ మంత్రుల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గత ఏడాది జమ్ముకశ్మీర్ లోని పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడి గురించి రాజ్‌నాథ్ సింగ్ ప్రస్తావించారు. పవాల్గామ్ ఉగ్రదాడి ఘటన యావత్ మానవాళిని కుదిపేసిందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆ దాడి అనంతరం 'ఆపరేషన్ సింధూర్ చేపట్టి ఉగ్రవాదులు ఎక్కడ ఉన్నా తప్పించుకోలేరని భారత్ నిరూపించిందని తెలిపారు. ఈ సందర్భంగా పాకిస్థాన్ పేరు ప్రస్తావించకుండా ప్రభుత్వ మద్దతుతో జరిగే సీమాంతర ఉగ్రదాడులను అస్సలు విస్మరించకూడదని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని అన్నారు. ఉగ్రవాదులకు సాయపడుతూ ఆశ్రయం కల్పించేవారిపై చర్యలు తీసుకోవడంలో ఎస్‌సీవో వెనకాడకూడదని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షోభం గురించి కూడా ఆయన మాట్లాడారు. గత కొన్నేళ్లుగా జరిగిన వరుస ఘర్షణల్లో అనేకమంది ప్రజలు ప్రాణాలు కోల్పోయారని, భారీ ఆస్తి నష్టం కూడా వాటిల్లిందని చెప్పారు. ఉగ్రవాద బెదిరింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన నొక్కి చెప్పారు. ఈ క్రమంలో ఉద్రిక్తతల పరిష్కారానికి దౌత్య మార్గాలను అనుసరించాలన్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్



భాష్యకార్ల సన్నిధి, యోగా నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో భారత ఉపరాష్ట్రపతికి పండితులు వేదాశీర్వచనం చేయగా.. తితిదే ఛైర్మన్, ఈవో స్వామి వారి చిత్ర పటాన్ని, తీర్థప్రసాదాలను అందించారు. సోమవారం విశాఖ ఆంధ్రావర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో ఉపరాష్ట్రపతి పాల్గొన్నారు. అక్కడి నుంచి నేరుగా ఇక్కడికి చేరుకున్నారు. ఆయనకు స్థానిక నేతలు, అధికారులు స్వాగతం పలికారు.

# గూగుల్ తో మారనున్న విశాఖ ముఖచిత్రం

విశాఖపట్నం,ఏప్రిల్ 28

డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యశాఖల మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో ఏపీలో ప్రయోజనాలు చూపిస్తున్నామని పేర్కొన్నారు. మంగళవారం తర్లువాడలో రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు సీఎం చంద్రబాబు భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో గూగుల్ క్లౌడ్ సంస్థ ప్రతినిధులు, కేంద్రమంత్రులు అశ్విని వైష్ణవ్, కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, శ్రీనివాసవర్మ, హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు.

ఈ డేటా సెంటర్‌కు తర్లువాడ, రాంబిల్లి, అడవివరంలో 600 ఎకరాలను ఏపీ సర్కార్ కేటాయించింది. ఈ కార్యక్రమంలో పాల్గొని మంత్రి లోకేశ్ మాట్లాడారు. విశాఖ అంటే గూగుల్ అని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఒకలెక్క.. ఇక నుంచి మరో లెక్క అని చెప్పుకొచ్చారు. ఇవాళ్టి నుంచి విశాఖ ముఖచిత్రం మారబోతోందని తెలిపారు.

# సిక్కిం ఆవిర్భావ దినోత్సవం

## పిల్లలతో కలసి ఫుట్‌బాల్ ఆడిన ప్రధాని




న్యూఢిల్లీ,ఏప్రిల్28 నరేంద్ర మోదీ సిక్కిం రాష్ట్ర రాజధాని గ్యాంగ్‌టక్‌లో సందడి చేశారు. యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడుతూ ఉల్లాసంగా గడిపారు. సిక్కిం రాష్ట్ర అవతరణ జరిగి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వేడుకలు జరుగుతున్నాయి. మంగళవారం జరగబోయే ముగింపు వేడుకల కోసం ప్రధాని గ్యాంగ్‌టక్ చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫుట్‌బాల్ ఆడారు. సిక్కిం 50వ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్న ప్రధాని మంగళవారం ఉదయం అక్కడి క్రీడాకారులతో కలిసి సరదాగా ఫుట్‌బాల్ ఆడారు. ఈ ఆటకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. గ్యాంగ్‌టక్‌లో యువ మిత్రులతో కలిసి ఆడడం చాలా ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు. ప్రధాని స్పోర్ట్స్ దుస్తుల్లో పిల్లలతో కలిసి ఆనందంగా ఫుట్‌బాల్ ఆడుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సిక్కిం 50వ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ ముగింపు కార్యక్రమానికి మోదీ హాజరై.. రూ.4,000 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. ఆ రాష్ట్రం భారత యూనియన్‌లో



చేరి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రోడ్‌షోలో పాల్గొన్నారు. అధికారిక కార్యక్రమాలకు ముందు గ్యాంగ్‌టక్‌లో యువతతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలు, వీడియోలను ప్రధాని తన సోషల్ మీడియా ఖాతాలో పంచుకోవడంతో అవి వేగంగా వైరల్ అయ్యాయి. యువతతో కలిసి క్రీడల్లో పాల్గొనడం తనకు ప్రత్యేక అనుభూతినిచ్చిందని ప్రధాని పేర్కొన్నారు. 'గ్యాంగ్‌టక్‌లో ఉదయం యువ స్నేహితులతో కలిసి ఫుట్‌బాల్ ఆడడం చాలా ఎనర్జీ ఇచ్చిందని మోదీ పేర్కొన్నారు. కాగా, సిక్కింలో ప్రధాని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థా పనలు చేయబోతున్నారు. సిక్కింలో రహదారుల కనెక్టివిటీ, ఆరోగ్యం, టూరిజం, విద్య, నగర అభివృద్ధి సహా వివిధ రంగాల్లో రూ.4,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభించనున్నారు.

# ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీ

### 14మంది మహిళల దుర్మరణం




జకార్తాన్యూఢిల్లీ,ఏప్రిల్28 ఇండోనేషియాలో రెండు రైళ్లు ఢీకొన్న ఘటనలో 14 మంది మృతిచెందగా, 84 మంది గాయపడ్డారు. దేశ రాజధాని జకార్తా శివారులో ఉన్న బెకాసి వద్ద ఈ ప్రమాదం జరిగింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని తొలగించే ప్రయత్నం జరుగుతుందని రైల్వే అధికారులు చెప్పారు. ఓ కమ్యూటర్ ట్రైన్‌తో పాటు లాంగ్ డిస్టాన్స్ రైలు సోమవారం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 14కు చేరుకున్నట్లు ఇండోనేషియా రైల్వే శాఖ అధికారులు తెలిపారు. గాలింపు పక్రియ ముగిసినట్లు రెస్క్యూ ఏజెన్సీ అధికారులు తెలిపారు. రైల్వే బోగీలు నుజ్జు నుజ్జు అయ్యాయని, వాటిల్లో చిక్కుకున్న వారిని తొలగించడం పెద్ద సమస్యగా మారిందన్నారు. రైలుకు చెందిన మహిళా బోగీ దెబ్బతిన్నదని, బాధితుల్లో అందరూ మహిళలే ఉన్నట్లు అధికారులు తెలిపారు. బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులను బయటకు తీసేందుకు ఇనుపకడ్డీలను గ్రైండర్లతో కట్ చేశారు. స్థానికంగా తిరిగే లోకల్ కమ్యూటర్ రైలు తొలుత ఓ ట్యాక్సీ ఢీకొన్నదని, ఆ తర్వాత అది మళ్లీ దూరం వెళ్లే మరో రైలును ఢీకొన్నట్లు బాబీ తెలిపారు.

# ఒకటో తేదీన జీతాలు రావడం లేదు

### ఎమ్మెల్యేకు అంగన్‌వాడీల స్పష్టీకరణ

మహబూబాబాద్,ఏప్రిల్28 కాంగ్రెస్ ప్రజాపాలన అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి నెలా ఒకటో తేదీన ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రూనాయక్ పేర్కొన్నారు. దీంతో అక్కడే ఉన్న అంగన్‌వాడీలు 'అయ్యో సార్ మాకు ఒకటో తేదీన జీతాలు రావడంలేదు' అని ముక్తకంఠంతో ఎమ్మెల్యే ప్రసంగానికి అడ్డుతగిలారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని రైతువేదికలో కల్యాణలక్ష్మి చెక్కులు, అంగన్‌వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. రామచంద్రూనాయక్ మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నామని తెలిపారు. దీంతో అక్కడే ఉన్న అంగన్‌వాడీ కలుగజేసుకొని 'సార్ మాకు మాత్రం జీతాలు రావడం లేదు' అని ప్రసంగానికి అడ్డుతగిలారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిలో జీతాలు పెంచాలనే అంశం ఉందని, త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పగా.. 'సార్ మాకు పోయిన నెల జీతం రూ.13,650 ఇప్పటి వరకు రాలేదు' అని అంగన్‌వాడీలు గుసగుసలాడారు.

# మిషన్ భగీరథ కార్మికులకు వేతన బకాయిలు

### ఆరు నెలలుగా జీతాలు చెల్లించడం లేదని ఆరోపణ




మెదక్,ఏప్రిల్28: మిషన్ భగీంథలో పని చేస్తున్న కార్మికులకు గత 6 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం సరైనది కాదని సీఐటీయూ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు. మంగళవారం చిలిపి చేడ్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న కార్మికులకు సరైన వేతనం ఇవ్వడం లేదని.. ఇచ్చే వేతనం కూడా 6 నెలలుగా రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో కార్మికులను ఐక్యం చేసి పోరాటం చేస్తామని తెలిపారు. కార్మికుల పనిగంటలను పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వారు తెలిపారు. 4 కొత్త లేబర్ చట్టాల అమలు కార్మికుల హక్కులను పెట్టుబడిదారులకు కట్టబెట్టడమే అవుతుందని అన్నారు. బ్రిటిష్ కాలం నుంచే కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 రకాల కార్మికచట్టాలను తొలగించడం సిగ్గు చేటు అని విమర్శించారు. దేశం మొత్తం కరోనాతో అతలాకుతలమవుతున్న సమయంలో (2019, 2020)లో నాలుగు కొత్త లేబర్ చట్టాలను తీసుకురావడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో సంపన్నులు పెరిగారని.. నిరంతరం కష్టపడుతున్న కార్మికులు మాత్రం రోడ్డున పడే దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. మే డే స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. దేశవ్యాప్తంగా మే 1 నుంచి 7వ తేదీ వరకు మేడే వార్షికోత్సవాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.

# కాలువలకు మరమ్మత్తులు

### తెలుగుగంగ ద్వారా కృష్ణాజలాలు నిలివివేత



చిత్తూరు,ఏప్రిల్28 తెలుగు గంగ ప్రాజెక్టు కింద చెన్నైకి సరఫరా చేస్తున్న కృష్ణా జలాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఆంధ్రరాష్ట్రంలోని కృష్ణానది నుంచి తెలుగుగంగ కాలువ ద్వారా విడుదల చేస్తున్న నీటిని ఏపీ సరిహద్దు ప్రాంతమైన కండలేరులో నిల్వవుంచుతారు. అక్కడి నుండి తెలుగుగంగ కాలువ ద్వారా తిరువళ్లూరు జిల్లాలోని పూండి రిజర్వాయర్‌కు మళ్లిస్తారు. ప్రస్తుతం కండలేరు-పూండి మధ్య తెలుగుగంగ ప్రాజెక్టులో ఏపీ ప్రభుత్వం చేపట్టిన మరమ్మతుల కారణంగా కృష్ణాజలాల సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు ప్రకటించారు. మరమ్మతులు ఈ నెలాఖరుకు పూర్తిచేశాక మే 1వ తేదీ నుంచి యథావిధిగా కృష్ణాజలాలను సరఫరా చేయనున్నట్లు ఏపీ అధికారులు హామీ ఇచ్చినట్లు రాష్ట్ర నీటిపారుదలశాఖ తెలిపింది. ఇదిలాఉండగా, నగరవాసులదాహార్తిని తీరుస్తున్న పూండి, చెంబరంబాక్కం, పుళల్, షోళవరం, కన్నన్‌కోట, తేర్వైకండిగై రిజర్వాయర్లలో ప్రస్తుతం 7,966 మిలియన్ ఘనపుటడుగుల నీటిని నిల్వవుంచినట్లు తెలిపారు. గత ఏడాది ఇదే రోజుకు నిల్వవుంచిన నీటిమట్టం కంటే 36 మిలియన్ ఘనపుటడుగులు తక్కువని, ఈ వేసవి సీజన్‌లో తాగునీటి కొరత ఉండదని అధికారులు స్పష్టం చేశారు.

# అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం

### అతివేగంతో పాదచారులను ఢీకొన్న కారు- ప్రమాదంలో నలుగురు వ్యక్తులు దుర్మరణం

విజయనగరం,ఏప్రిల్28: పూసపాటిరేగ మండలం పేరాపురం వద్ద జాతీయ రహదారి 16పై సోమవారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు దుర్మరణం చెందగా.. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నానికి వెళ్తున్న గుత్తేదారుల మిత్ర బృందం ప్రయాణిస్తున్న కారు మితిమీరిన వేగం వల్లే ఈ ప్రమాదం జరిగింది. రాత్రి 12 గంటల సమయంలో అతివేగంగా వచ్చిన కారు.. పేరాపురం వద్ద దుకాణంలో టీ తాగి రోడ్డుపై ఉన్న ఇద్దరు పాదచారులను ఢీకొట్టింది. అనంతరం వాహనాన్ని అదుపు చేయలేక సమీపంలో ఆగి ఉన్న లారీ వైపు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఒకరు.. పాదచారులిద్దరూ అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు.

కారు చోదకుడితో పాటు తీవ్రంగా గాయపడిన మరొకరిని విజయనగరంలోని మహారాజా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా ఒకరు మార్గమధ్యలో మృతి చెందారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బొబ్బిలి వాసిగా పోలీసులు గుర్తించారు. ప్రమాదంలో విశాఖకు చెందిన ఇరిగేషన్ కాంట్రాక్టరు శ్రీనివాస్ మృతి చెందినట్లు భావిస్తున్నారు. కారులో ప్రయాణిస్తున్న వారిలో అమరావతికి చెందిన ఓ న్యాయమూర్తి బంధువులు ఉన్నారని తెలిసింది. ఎస్పీ ఏఆర్ దామోదర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. సీఐ రామకృష్ణ, ఎస్సై దుర్గాప్రసాద్‌తో కలిసి సహాయక చర్యలు చేపట్టారు.

# డ్రగ్స్ కేసులో రోహిత్ రెడ్డికి బెయిల్



**నేడు జైలు నుంచి విడుదల అయ్యే ఛాన్స్**

హైదరాబాద్,ఏప్రిల్28 మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసులో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత మార్చి 14న రాత్రి రోహిత్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో మొత్తం ముగ్గురిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు పోలీసులు. వారిలో పైలట్ రోహిత్ రెడ్డి, ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, వ్యాపారవేత్త నమిత్ శర్మ ఉన్నారు. రోహిత్ రెడ్డి తరఫున మాత్రమే న్యాయవాదులు హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు.బెయిల్ మంజూరు కావడంతో బుధవారం చంచల్‌గూడ జైలు నుంచి రోహిత్ రెడ్డి విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మార్చి 14న మొయినాబాద్ ఫాంహౌస్‌లో దాడులు చేసిన పోలీసులు.

కొకైన్, లిక్కర్ బాటిళ్లు, స్వాధీనం చేసుకున్నారు. పార్టీలో పాల్గొన్న 11 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా.. వారిలో ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలింది. ఈ కేసులో మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి..

ఒక నెలకు పైగా చంచల్‌గూడ జైలులో ఉన్నారు. ఎపికి చెందిన ఓ ఎంపి కూడా


# స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు



హైదరాబాద్,ఏప్రిల్28 డాలర్ కాస్త బలపడడం, గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం వంటి కారణాలతో మంగళవారం బంగారం ధర తగ్గుదల నమోదు చేసింది. భౌగోళిక, అంతర్జాతీయ రాజకీయ కారణాలతో కాస్త హెచ్చుతగ్గులకు లోనవుతోంది. మంగళవారం ఉదయం పది గంటల సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.710 మేర తగ్గుదల నమోదు చేసింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,000గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,250గా ఉంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.650 మేర తగ్గింది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,150గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,400గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు చేశాయి. కిలోకు 4 వేల రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2.65 లక్షలుగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2.6 లక్షలుగా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2.65 లక్షలుగా, బెంగళూరులో రూ.2.60 లక్షలుగా ఉంది.

# రాష్ట్రంలో సమృద్ధిగా పెట్రోల్, డీజిల్ నిల్వలు

- **అనవసర భయాందోళనలకు గురి కావద్దు**
- **పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర**




హైదరాబాద్,ఏప్రిల్28 రాష్ట్రనీలో పెట్రోల్, డీజిల్ నిల్వలు, సరఫరా సమృద్ధిగా ఉన్నట్లు పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం 27 వ తేదీన డిమాండ్ ను మించి పెట్రోల్ , డీజిల్ లను 29,939 కిలో లీటర్లు సరఫరా చేసినట్లు వివరించారు. సగటున రోజుకు 5,883 కిలో లీటర్లు పెట్రోల్, 7,348 కిలో లీటర్లు డీజిల్ కు డిమాండ్ ఉండేదని ఆయన తెలిపారు. కానీ 27 వ తేదీన 11,490 కిలో లీటర్లు పెట్రోల్, 18,449 కిలో లీటర్లు డీజిల్ ను వాహనదారులకు సరఫరా చేసినట్లు తెలిపారు. సరఫరాను క్షేత్ర స్థాయి అధికారులు, పెట్రోల్ కంపెనీల ప్రతినిధులతో రెగ్యులర్ గా మానిటరింగ్ చేస్తున్నట్లు తెలిపారు. అపోహలతో పెట్రోల్, డీజిల్ ను నిల్వచేసుకోవద్దని వినియోగదారులకు పౌర సరఫరాల శాఖ కమిషనర్ సూచించారు.

# నకిలీ కుల సర్టిఫికెట్లతో టీచర్ ఉద్యోగం...
# బయటపడినా చర్యలు లేవెందుకు?

**ఎస్టీ, రెండు సర్టిఫికెట్లు, స్పష్టమైన ఆధారాలు... అయినా అధికారులు మౌనం ఎందుకు?**

**హైదరాబాద్ ఎస్టేట్ ,రంగారెడ్డి జిల్లా ప్రతినిధి**
రంగారెడ్డి జిల్లా ,ఇబ్రహీంపట్నం మండలం, ఎలిమినేడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎర్ర రమణ అనే మహిళ సెకండరీ గ్రేడ్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే, ఆమె ఉద్యోగ ప్రస్థానం వివాదాస్పదంగా మారింది. ఒకే వ్యక్తికి రెండు ఎస్సీ , ఎస్టీ సర్టిఫికెట్లు జారీ కావడం, ఆ సర్టిఫికెట్ల ఆధారంగా 2001 డీఎస్సీ ద్వారా ఉద్యోగం పొందడం వంటి కీలక అంశాలు బయటపడినా, ఇప్పటివరకు సంబంధిత శాఖల నుంచి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది.అధికారిక రికార్డులు, నియామక పత్రాలు, మెరిట్ లిస్ట్ వివరాలు --- అన్నీ ఈ వ్యవహారంలో అనుమానాలను బలపరుస్తున్నాయి. అయినప్పటికీ, విచారణ ఎక్కడ నిలిచిపోయిందో, ఎందుకు పూర్తి కాలేదో ఇప్పటికీ స్పష్టత లేదు.ఇప్పుడు ప్రజలు, నిరుద్యోగ యువత, విద్యావంతులు సూటిగా ప్రశ్నిస్తున్నారు --- ఒకే వ్యక్తికి రెండు కుల సర్టిఫికెట్లు ఎలా జారీ అయ్యాయి?
ఆ సర్టిఫికెట్లు నకిలీవని ఆధారాలు ఉన్నా చర్యలు ఎందుకు లేవు?
డీఎస్సీ నియామకాల్లో ఇలాంటి లోపాలు ఎలా జరిగాయి?
సంబంధిత అధికారుల బాధ్యత ఏమైంది?విద్య వంటి కీలక రంగంలో ఇలాంటి అక్రమాలు చోటు చేసుకోవడం అంటే అది కేవలం ఒక వ్యక్తి తప్పు కాదు --- మొత్తం వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం అని నిపుణులు అంటున్నారు.
ఇంకా ముఖ్యంగా ---
ఈ విషయం పలు దినపత్రికల్లో ప్రచురితమైనప్పటికీ, ప్రభుత్వం మరియు సంబంధిత శాఖలు స్పందించకపోవడం మరింత అనుమానాలకు దారి తీస్తోంది.
ప్రస్తుతం ప్రజల డిమాండ్ స్పష్టంగా ఉంది ---
ఈ వ్యవహారంపై తక్షణమే పూర్తి స్థాయి విచారణ జరిపి, నకిలీ సర్టిఫికెట్లు వినియోగించిన వ్యక్తిపై మాత్రమే కాదు, వాటిని జారీ చేసిన అధికారులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలి.




కానీ ఇంకా ఒక ప్రశ్న మాత్రం మిగిలే ఉంది ---
ఇన్ని ఆధారాలు బయటపడ్డాక కూడా చర్యలు ఎందుకు లేవు?
ప్రభుత్వం మౌనం వెనుక అసలు కారణం ఏమిటి? ఇదే ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది.

## లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ = సర్పంచ్ వినోద్ రాథోడ్

**ముఖ్య అతిథిగా.. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్ర రెడ్డి**



( హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి కృష్ణ చారి మహేశ్వరం ఏప్రిల్ 28:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పడమటి తండా గ్రామ సర్పంచ్ వినోద్ రాథోడ్ మాట్లాడుతూ... లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ చేయడం జరిగింది అన్నారు.. కాట్రావత్ అచ్చాలి ఎన్టీఆర్ తండా ఈ యొక్క కార్యక్రమంలో.. ముఖ్య అతిథిగా.. మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రరెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ నాయక్, ఎంపీడీవో శైలజ రెడ్డి, ఎమ్మార్వో, స్థానిక మహేశ్వరం సర్పంచ్ మునగపాటి నవీన్, తోపాటు మాజీ పిఎస్ సిఎస్ చైర్మన్ మంచే పాండు యాదవ్ నాగారం గ్రామ సర్పంచ్ బండారి లింగం తదితరులు యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది అని పడమటి తండా సర్పంచ్ వినోద్ రాథోడ్ విలేకరులకు తెలియజేశారు

## పోస్ట్ ఆఫీస్ ద్వారా పెన్షన్ పొందుతున్న వృద్ధులకు అందని పెన్షన్ డబ్బులు


**అమ్మ వికలాంగ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు మారపల్లి నరేష్.**



హైదరాబాద్ ఎస్టేట్ మంచిర్యాల మంచిర్యాల జిల్లాలో పోస్ట్ ఆఫీస్ ద్వారా పెన్షన్ పొందుతున్న ఒంటరి మహిళలు మరియు వృద్ధులు దివ్యాంగులకు గవర్నమెంట్ నుండి డబ్బులు పడినా కానీ పోస్ట్ ఆఫీస్ వారు బ్యాంకులో డబ్బులు లేవని చెప్పి నిర్లక్ష్యమైన సమాధానం చెప్పుచున్నారు వారికి సకాలంలో అందాల్సిన పెన్షన్ అందకుండా చేస్తున్నారు. పోస్ట్ ఆఫీస్ ద్వారా లేక బ్యాంకు ద్వారా డబ్బులు లేవంటూ అంటూ సమాధానం చెబుతున్నారు దీనిపైన పై అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి స్పందన కూడా లేదు అంతేకాకుండా ఈ పోస్ట్ ఆఫీస్ ద్వారా కాకుండా డైరెక్ట్ అకౌంట్లోకి డబ్బులు పడే విధంగా చేయాలని ఎమ్మెల్యే మరియు మంత్రి అయిన వివేక్ కి దృష్టికి తీసుకెళ్లిన దీని మీద కూడా ఎలాంటి స్పందన లేదు. ఇలా ఆలస్యంగా డబ్బులు పడడం వల్ల వృద్ధులకు, ఒంటరి మహిళకు వితంతువులకు దివ్యాంగులకు చాలా ఇబ్బందులు పడాల్సివస్తుంది. పెన్షన్ డబ్బులు రాక ఈ సమస్య ను ఏవరి దృష్టికి తీసుకెళ్లినా పటించుకోవడం లేదు ఇకనైనా ప్రతినెల 15 తారీకు లోపు పెన్షన్డబ్బులు పడాలని లేనియెడల డైరెక్టర్ బ్యాంకు ఖాతాలో జమ చేయాల్సింది, గా మేము డిమాండ్ చేస్తున్నాము అని అమ్మ వికలాంగ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు మారపల్లి నరేష్. పందుల రవి జిల్లా అధ్యక్షులు తెలిపారు.

## పెట్రోల్ డీజిల్ లేక వాహనదారులకు తప్పని తిప్పలు

**రెండు లీటర్ల పెట్రోల్ కోశం గంటల తరబడి లైన్ కట్టాలి**



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి దానప్పగారి చంద్రశేఖర్ మహేశ్వరం : ప్రపంచ దేశాలలో జరిగిన యుద్ధాల కరణంగా రెండు నెలల నుండి పెట్రోల్ డీజిల్ సరఫరా లోపంతో వాహనదారులు తిప్పలు తప్పడం లేదు మహేశ్వరం మండల కేంద్రంలోని చెప్పడానికి 4 పెట్రోల్ పంపులు ఉన్న ఏ బంకులో కూడా పెట్రోల్ డీజిల్ లేక వాహనదారులు ఎంత ఇబ్బందులకు గురయ్యారు, పెట్రోల్ పోసుకోవాలంటే అర్ధరాత్రి నిద్ర వచ్చిన నిద్రపోకుండా పెట్రోల్ పంపు వద్దకు వచ్చిన నో స్టాక్ అని దర్శనమిస్తున్నాయి, పెట్రోల్ పోసుకోవాలంటే, తిరుపతి వెళ్ళిన దేవుని దర్శనం అవుతుంది కానీ పెట్రోల్ పంపు దగ్గరకు వెళ్తే దొరకడం లేదు, క్యూలైన్లో ఉండి అక్కడే వాహన దారులు నిద్ర చేయవలసి వస్తుంది, ఈ విషయంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అలాంటిది ఏమీ లేదని చేతులెత్తేస్తున్నారు, ఇప్పటికైనా స్పందించి వాహనదారులకు, ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు,


## సంక్షేమ పథకాల ప్రచారంలో సమాచార శాఖను తీర్చిదిద్దాలి



హైదరాబాద్, ఏప్రిల్ 28: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ చేరాలంటే సమాచార పౌర సంబంధాల శాఖ తన ప్రచార శైలిని మరింత ఆధునీకరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నారగౌని పురుషోత్తం అన్నారు. ఐఅండ్ పీఆర్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ముకుంద రెడ్డిని మంగళవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో టీఎస్జేయూ ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసింది.ఈ సందర్భంగా నారగౌని పురుషోత్తం మాట్లాడుతూ..మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను జోడించి, ప్రచార విభాగాలను బలోపేతం చేయడం ద్వారా పథకాల లబ్ధిని ప్రజలకు మరింత చేరువ చేయవచ్చని ఆయన ఆకాంక్షించారు. అనుభవజ్ఞులైన ముకుంద రెడ్డి నేతృత్వంలో శాఖ కొత్త పుంతలు తొక్కుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్జేయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ముత్యం ముఖేష్ గౌడ్ తదితరులు పాల్గొని కమిషనర్‌ను ఘనంగా సన్మానించారు.

## కల్వకోల్ సర్పంచ్ లక్ష్మమ్మ చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి చెక్కుని పంపిణీ చేయించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

***ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి***



( హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి కృష్ణ చారి మహేశ్వరం ఏప్రిల్ 28:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండలం కేంద్రంలోని కల్వకోల్ గ్రామానికి చెందిన.. సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ చేతుల మీదుగా కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయించిన మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా రెడ్డి కల్వకోల్ గ్రామానికి చెందిన గూడెపు సంతోష, పెంజల సంతోష, బక్కని శాంతమ్మ, కాసాని వినోద, ఆముదాలపల్లి బాలమణి, రేలా అరుణ, గుర్రంపల్లి పుష్పమ్మ, ఎర్ర యాదమ్మ, చెక్కులను పంపిణీ చెయ్యడం జరిగింది ఈకార్యక్రమంలో.. ఎంపీడీవో శైలజ రెడ్డి, ఎమ్మార్వో, అప్పలనాయుడు,ఎండిఓ, కల్వకోల్ గ్రామ సర్పంచ్ బక్కని లక్ష్మమ్మ రవి మాదిగ వీఆర్వో రాజేందర్ మరియ మండలంలో అన్ని గ్రామాల సర్పంచులు ప్రజా ప్రతినిధులో పాల్గొన్నారు.

## మహేశ్వరం మండలంలో కిషోర బాలికల భద్రత వారోత్సవాలు




( హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి కృష్ణ చారి మహేశ్వరం ఏప్రిల్ 28:)
ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహేశ్వరం మండలంలో కిషోర బాలికలు, పిల్లల భద్రతపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించబడ్డాయి. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఒకేసారి ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసి బాలికల హక్కులు, భద్రతపై చైతన్యం కల్పించారు.మహేశ్వరం మండల మహిళా సమాఖ్య భవనంలో జరిగిన ప్రధాన సమావేశంలో బాల్య వివాహాల నివారణ, బాలికల విద్య, మహిళలపై హింస నివారణ వంటి కీలక అంశాలపై వివరణాత్మకంగా చర్చించారు. 18 సంవత్సరాలు పూర్తయ్యే వరకు వివాహాలు జరపకూడదని, ప్రతి ఆడపిల్ల తప్పనిసరిగా చదువు కొనసాగించాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టడం సమాజ బాధ్యతగా భావించాలని, మహిళలపై ఎలాంటి హింస జరిగినా ఎదుర్కొనే ధైర్యం పెంపొందించుకోవాలని అవగాహన కల్పించారు.
అలాగే కిశోర బాలికల అభివృద్ధి కోసం 14 నుండి 18 సంవత్సరాల వయస్సు గల బాలికలతో ప్రత్యేక సంఘాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ సంఘాల ద్వారా బాలికలకు నాయకత్వ లక్షణాలు, స్వీయ రక్షణ, ఆరోగ్య అవగాహన వంటి అంశాల్లో శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. టీనేజ్ వయస్సులో గర్భధారణకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రుల అనుమతి లేకుండా వివాహాలు చేసుకోవద్దని స్పష్టంగా సూచించారు.ఈ కార్యక్రమంలో పోలీసు విభాగ ప్రతినిధులు, ఐసిడిఎస్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, మండల సమాఖ్య సభ్యులు, సీసీలు, కిశోర బాలికలు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో బాలికల భద్రత, సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించి, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## గంగారం గ్రామంలో మహిళలకు అవగాహన సదస్సు

**● లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి పంపిణీ = సర్పంచ్ దేవేందర్ నాయక్**
**● ముఖ్య అతిథిగా.. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్ర రెడ్డి**




( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి ఏప్రిల్ 28:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ మహేశ్వరం మండల కేంద్రంలోని గంగారం గ్రామంలో.. సర్పంచ్ దేవేందర్ నాయక్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలోని తెలంగాణ ప్రభుత్వం మహిళ అవగాహన కార్యక్రమం ఉదయం టీనేజ్ ఎంప్లాస్మెంట్ అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలియజేశారు అనంతరం మహేశ్వరం మండల కేంద్రంలో.. సర్పంచ్ దేవేందర్ నాయక్ చేతులు మీదుగా లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెట్లను పంపిణీ చేయడం జరిగింది అన్నారు యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా..
మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మరియు ఎంపీడీవో శైలజ రెడ్డి, ఎమ్మార్వో అప్పలనాయుడు, పాల్గొన్నారు గంగారం గ్రామానికి చెందిన 9 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేయడం జరిగింది ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవేందర్ నాయక్ తో పాటు ఉపసర్పంచ్ మహేందర్ వార్డు మెంబర్ మోహన్ నాయక్ ఎం రవి ఎం దేవా వీఆర్వో శ్రీనివాస్ తదితరులు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నారు

## సీఈసీ టాపర్ గా నిలిచిన విద్యార్థిని మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ హాస్టల్ యాచారం



(లి హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి ఏప్రిల్ 28)లి
ధర్మన్నగూడ యాచారం మండల్ కొంపోజు దీప్తి 490/500 మార్కులతో కాలేజీ టాపర్ గా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ హాస్టల్లో సీఈసీ టాపర్ గా నిలిచిన విద్యార్థికి ధర్మన్నగూడ సర్పంచ్ పండుగ పద్మావతి బాలరాజ్ ఉప సర్పంచ్ గౌర నాగరాజ్ సత్తు ప్రదీప్ రెడ్డి శాలువా సన్మానంతో ఆశీర్వదించడం జరిగింది పండుగ పద్మావతి బాలరాజ్ మాట్లాడుతూ కొంపో జు దీప్తిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి విద్యార్థిని విద్యార్థులు స్టేట్ టాపర్లుగా రావాలని కోరడం జరిగింది

## మిషన్ భగీరథ నీళ్లు రాక ప్రజలు అవస్థలు

**పట్టించుకోని అధికారులు**



హైదరాబాద్ ఎస్టేట్ న్యూస్ మహేశ్వరం ప్రతినిధి దానప్ప గారి చంద్రశేఖర్
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని పెద్దపులి నాగారం గ్రామంలో గత నెల రోజుల నుండి మిషన్ భగీరథ వాటర్ సమస్యలు తీవ్రంగా మొదలయ్యాయి.. ఒక్కరోజు వాటర్ వదిలితే నాలుగు లేదా ఐదు రోజుల వరకు వాటర్ రావడం లేదు అని ప్రజలు వాపోతున్నారు.. అసలు కారణాలు మిషన్ భగీరథ వాటర్ ఎందుకు రావడం లేదని విషయంపై అధికారులు స్పష్టంగా చెప్పకపోవడంతో. ప్రజలు నీళ్ల సమస్యతో
చాలా ఇబ్బందులకు గురవుతున్నారు ఇప్పటికైనా.. వాటర్ ఎందుకు రావడం లేదో స్పష్టమైన సమాచారం ప్రజలకు అందజేయవలసిన అవసరం అధికారులకు ఉందని తెలియజేస్తూ గ్రామంలో వాటర్ సమస్య లేకుండా చూడాలని అధికారులకు గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేయడం జరుగుతుంది

## సంపాదకీయం



# భూసేకరణలతో రైతుల గుండెల్లో రైళ్లు !

రాజధాని అమరావతికి ఇప్పటికే 32వేల ఎకరాలు సేకరించారు. మరో దశలో భూసేకరణకు సిద్దం అవుతున్నారు. ఇప్పటి వరకు సేకరించిన భూములకు సంబంధించి రైతులకు సరైన పరిహారం దక్కలేదు. ప్లాట్లు కూడా దక్కలేదు. కౌలు కూడా అరకొరగా అందచేస్తున్నారు. అయినా రైతులు రాజధాని కోసం సర్వస్వం త్యాగం చేశారు. మరిన్ని భూములు సేకరించే ప్రయత్నంలో కొంత వ్యతిరేకత తప్పడం లేదు. మూడు పంటలు పండే, కృష్ణా పరివాహక భూములు ఇవ్వడం సాధ్యం కాదని అంటున్నారు. రైతులకు మంచి ధరలు ఇచ్చి కొనడంలో కూడా సర్కార్ మీనమేషాలు లెక్కిస్తోంది. గతంలో ఇచ్చిన భూముల రైతులకు పెద్దగా దక్కింది కూడా లేదు. ఇప్పుడది చాలదన్నట్టు 65వ నెంబరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 189 కిలోమీటర్ల పొడవున 250 మీటర్ల వెడల్పుతో ఔటర్ రింగురోడ్డు ఒఆర్ఆర్ నిర్మాణం చేపట్టబోతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో గుంటూరు, ఎన్‌టిఆర్, పల్నాడు, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ప్రభావిత ప్రాంతాల రైతులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా పరిటాల నుండి ఇబ్రహీంపట్నం వరకూ కృష్ణానదికి సమీపంగా ఒఆర్ఆర్ నిర్మిస్తామంటూ అక్కడి భూయజమానులతో ఇటీవల అధికారులు చెప్పారు. దీంతో ఇప్పటికే మూడుసార్లు భూసేకరణ కింద భూమిని కోల్పోయామనీ, ప్రభుత్వానికి ఇంకెన్నిసార్లు భూములివ్వాలని రైతులు అభ్యంతరం తెలిపారు. మరోమారు భూసేకరణ పిడుగు పడడంతో వారు ఆందోళనలో ఉన్నారు. దేశంలో అనేక ముఖ్య నగరాల్లో ఒఆర్ఆర్, జాతీయ రహదారులు 70 మీటర్ల వెడల్పుతో నిర్మించగా అమరావతి రింగురోడ్డును 250 మీటర్ల వెడల్పుతో నిర్మించే ప్రతిపాదన సరికాదు. రైతుల అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా కేంద్ర ప్రభుత్వ జాతీయ రహదారుల అథారిటీ (ఎన్‌హెచ్‌ఎఐ) డిపిఆర్ కూడా సిద్ధం చేసి, ముందుకు పోతుండడం రైతుల ప్రయోజనాలు దెబ్బతీయడమే. వారికి భూమికి భూమి ఇచ్చివుంటే సమస్యలు వచ్చి ఉండేవి కావు. రాజధాని నిర్మాణం, పట్టణాభివృద్ధి పేరిట రాష్ట్ర ప్రభుత్వం రైతులను తీవ్ర ఒత్తిళ్లకు గురిచేయడం సరైన పద్ధతికాదు. అమరావతి కోసం తొలి దశ పూలింగ్‌లో భూములిచ్చిన రైతులకు డెవలప్ చేసిన ప్లాట్లు ఇప్పటికీ ఇవ్వలేదు. భూ యజమానులకు కౌలు, పేదలకు పింఛన్లు సరిగా అందడం లేదు. ఇబ్బందులిలా వుండగానే ఏలినవారు రెండవ దశ, అనంతరం మరింత విస్తరించడానికి భూములు సమీకరిస్తామని ఊరూరా తిరుగుతుంటే అన్నదాతల గుండెలు అదురుతున్నాయి. అదేపనిగా వేల ఎకరాలు సేకరించడం వెనక రియల్ మోసం ఉందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తొలుత రాజధాని కోసం ప్రతిపాదించిన భూమితో సరిపెట్టుకోకుండా మరోమారు భూసేకరణకు దిగారు. ఇప్పుడు ఓఆర్ఆర్ ప్రతిపాదిస్తున్న మండలాలు, గ్రామాల పరిధిలో భూములు చాలా విలువైనవి. రైతులు, కూలీల జీవనం వాటిపైనే ఆధారపడి ఉంది. ఆ భూముల విలువ బహిరంగ మార్కెట్లో కోటి రూపాయల నుండి రెండుకోట్ల వరకూ ఉంటుంది. భూములు కోల్పోయే రైతులకు వ్యక్తిగతంగా నోటీసులు ఇవ్వకుండా కొన్ని గ్రామాల్లో సచివాలయాల ముందు భూముల సేకరణకు సంబంధించి సర్వే నెంబర్లు, ఎల్‌పి నెంబర్లు సేకరించే భూమి విస్తీర్ణం వంటి వివరాలతో నోటీసులు అతికించారు. ఇందులో ఏ రైతు భూమిని ఎంత విస్తీర్ణం ప్రభుత్వం సేకరించబోతోంది వంటి వివరాలు రైతుల వారీగా లేకపోవడంతో గందరగోళం నెలకొంది. ప్రభుత్వం పత్రికల్లో చేసిన ప్రకటన, సచివాలయాల్లో వేలాడదీసిన పత్రాలు పారదర్శకంగా లేకపోవడంతో రైతులు భయాందోళనల్లో ఉన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం గ్రామసభలు జరిపి సామాజిక ప్రభావ అంచనా వివరించి రైతులు, ప్రజల సమ్మతి పొందడం అవసరం. అటువంటి చట్టబద్ధమైన ప్రక్రియ అమరావతి ఔటర్‌రింగు రోడ్డు ప్రతిపాదిత

గ్రామాల్లో ఇప్పటి వరకూ ఎక్కడా చేపట్టకపోవడం ప్రభుత్వానికి తగదు. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఉన్న భూముల రేటుకు అనుగుణంగా ప్రభుత్వం పరిహారం ఇవ్వాలన్న రైతుల కోర్కె ఎంతో సమంజస మైనది. నయాయబద్దమైనది కూడా. ఆ ప్రాంతం అభివృద్ధి చెందితే భూముల విలువలు ఎంతగానో పెరుగుతాయని భూ సమీకరణకు రైతులను అంగీకరింపజేయడానికి చెప్పిన ఏలికలు ఆ రైతులకు ఇప్పటి మార్కెట్ విలువనైనా పరిహారంగా చెల్లించలేదు. ఆర్ఆర్‌లో భూమి కోల్పోతున్న ఎన్‌టిఆర్ జిల్లాకు చెందిన 71 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. కొత్తగా జాతీయ రహదారి వేయాలనుకున్న ప్రాంతం కృష్ణానది బఫర్‌జోన్లో ఉందని, గతంలో వరదలు వచ్చిన సమయంలో పెద్దఎత్తున ముంపునకు గురయ్యా యని, నీటి ఒత్తిడి కూడా ఎన్‌టిఆర్ జిల్లావైపు ఉంటోందని, వరదలు వచ్చిన సమయంలో నష్టం ఎక్కువగా ఉండటంతోపాటు రోడ్డుకు దక్షిణభాగంలో ఉండే గ్రామాలన్నీ మునిగిపోతాయని ధర్మాసనం ఎదుట మొరపెట్టుకున్నారు. అన్నదాతల వాదనలను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం జాతీయ రహదారి విస్తరణకు సంబంధించిన పూర్తి వివరాలు కోర్టుకు సమర్పించాలని ఆర్‌అండ్‌బి, జలవనరులు, ఎన్‌హెచ్‌ఎఐ అధికారులను ఆదేశించింది. ఇప్పటికైనా విచక్షణతో వ్యవహరించడం అవసరం. ముందుకు వెళ్లడం అన్ని విధాలా మంచిది.

# వివాదంలో అషురెడ్డి వ్యవహారం

- **పెళ్లిపేరుతో ధర్మేంద్ర నుంచి రూ. 9.83 కోట్లు వసూళ్లు**
- **ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు**
- **హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసిన అషురెడ్డి**

హైదరాబాద్బ,ఏప్రిల్ 28

బిగ్ బాస్ ఫేమ్, ప్రముఖ సినీనటి అషురెడ్డి చుట్టూ వివాదాలు ముదురుతున్నాయి. పెళ్లి పేరుతో తనను, తన కుటుంబాన్ని నమ్మించి దాదాపు రూ. 9.83 కోట్లు మోసం చేసిందంటూ బాధితుడు ధర్మేంద్ర కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు ఆమెపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ అషురెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. బాధితుడు ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం ఈ కేసులోని ప్రధానాంశాలు ఇలా ఉన్నాయి. అషురెడ్డి, ధర్మేంద్ర వివాహం చేసుకోవాలని అనుకున్నారని వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ప్రముఖ జ్యోతిష్కుడు వేణుస్వామి వద్దకు వెళ్లి ఇరు కుటుంబాలు జాతకాలు కూడా చూపించాయని ప్రచారం జరుగుతోంది. పెళ్లి సాకుతో అషురెడ్డి తన వద్ద నుంచి సుమారు రూ. 9.83 కోట్లు వసూలు చేసిందని ధర్మేంద్ర ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా, ఆమె సోదరి దివ్యారెడ్డికి కూడా రూ. 50 లక్షలు ఇచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పెళ్లికి అన్ని సిద్ధమవుతున్న తరుణంలో అషురెడ్డి అకస్మాత్తుగా ధర్మేంద్రను వివాహం చేసుకోవడానికి నిరాకరించినట్లు సమాచారం. అషురెడ్డి తనను మానసికంగా, ఆర్థికంగా వేధించిందని బాధితుడు ధర్మేంద్ర పేర్కొన్నారు. అషురెడ్డి అవసరాల కోసం తాను పలు బ్యాంకుల నుంచి లోన్‌లు తీసుకుని మరీ ఖర్చు చేశానని తెలిపారు. ఇప్పుడు ఆ లోన్‌లు తీర్చలేక ఇబ్బంది పడుతున్నానని ధర్మేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే, తనపై తిరిగి కేసు పెడతానని లేదా ఆత్మహత్య చేసుకుంటానని అషురెడ్డి బెదిరిస్తోందని ఆయన ఫిర్యాదులో తెలిపారు. తన బాయ్‌ఫ్రెండ్ జయంత్‌తో కలిసి అషురెడ్డి ఈ డ్రామా ఆడిందని, తనను మోసం చేసిందని బాధితుడు వాపోతున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అషురెడ్డి కుటుంబంపై పోలీసులు కఠినమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నేరానికి పాల్పడటం వంటి సెక్షన్ల కింద నాన్ బెయిలబుల్ కేసు నమోదైంది. అయితే తనపై వస్తున్న ఆరోపణలను అషురెడ్డి తోసిపుచ్చారు. ఈ మేరకు హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. కనీసం తన వెర్షన్ తీసుకోకుండానే పోలీసులు



ఏకపక్షంగా కేసు నమోదు చేశారని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. తనపై నమోదైన కేసులో వాస్తవం లేదని, కాబట్టి ఆ కేసును వెంటనే కొట్టివేయాలని ఆమె కోర్టును వేడుకున్నారు. ఈ కేసు ఇప్పుడు న్యాయస్థానం పరిధిలో ఉంది. రెండు నెలల క్రితమే ఫిర్యాదు చేసినా, ఇప్పుడు ఈ వ్యవహారం వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. అషురెడ్డి పిటిషన్‌పై హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# జిల్లాలో సాధారణ స్థితికి పెట్రోల్, డీజిల్‌కు సరఫరా..

ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా పెట్రోల్ డీజిల్ సరఫరా పర్యవేక్షణ..


వినియోగదారుల అవసరాలకు అందుబాటులో పెట్రోల్ డీజిల్..

జిల్లాలో ప్రతి రోజు 8 లక్షల డీజిల్ 6 లక్షల పెట్రోల్ సరఫరా..

జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ.

విజయవాడ,ఏప్రిల్28 జిల్లాలో పెట్రోల్, డీజిల్ సరఫరా పూర్తిగా సాధారణ స్థితికి చేరుకుందని ప్రస్తుతం ఎటువంటి కొరత లేకుండా ఇంధనం సమృద్ధిగా అందుబాటులో ఉందని వినియోగదారులు ఎటువంటి అందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ తెలిపారు.

జిల్లాలో పెట్రోల్ డీజిల్ సరఫరా పై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పర్యవేక్షణ నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం నిడమానూరులో హెచ్‌పిసిఎల్, బిపిసిఎల్, ఐఓసిఎల్ బంకులను ఎనికెపాడులోని హెచ్‌పిసిఎల్ బంకును రామవరప్పాడులోని ఐఓసిఎల్ బంకులలో పెట్రోల్ డీజిల్ నిల్వలు సరఫరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల వదంతుల కారణంగా పెట్రోల్ డీజిల్ కొరత ఏర్పాటుదుందనే అపోహలతో వినియోగదారులు బయాందోళనలకు గురై అవసరాలకు మించి డీజిల్ పెట్రోల్ కొనుగోళ్ళు చేయడంతో కొంత ఇబ్బందికరమైన పరిస్థితులు ఎదురయ్యాయన్నారు. డీజిల్ పెట్రోల్ సజావుగా వినియోగదారులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లా యంత్రాంగం తీసుకున్న చర్యల కారణంగా పెట్రోల్ డీజిల్ సరఫరా సాధారణ స్థితికి చేరుకోవడం జరిగిందన్నారు. ఇంధన సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి జిల్లాలోని పెట్రోల్ బంక్‌ల వద్ద సరఫరా పరిస్థితిని క్రమం తప్పకుండా సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పెట్రోల్, డీజిల్ సరఫరా కొనసాగుతున్నదని, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. అపోహాలు, అసత్య ప్రచారాలను నమ్మకుండా అవసరమైన మేరకు మాత్రమే ఇంధనం వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ప్రతి రోజు సుమారు 8 లక్షల లీటర్ల డీజిల్, 6 లక్షల లీటర్ల పెట్రోల్ సరఫరా జరుగుతోందని కలెక్టర్ వెల్లడించారు. ఆయిల్ కంపెనీలతో సమన్వయం చేసుకుంటూ సరఫరాలో ఎటువంటి అంతరాయం



లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రెవెన్యూ పోలీస్ వ్యవసాయ తదితర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి, ఎక్కడా ఇంధన కొరత ఏర్పడకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారన్నారు. ఈకారణంగా పెట్రోల్ బంకుల వద్ద క్యూ లైన్‌లలో వాహనాలు నిలబడాల్సిన అవసరం లేకుండా తక్షణమే ఆయిల్ పొందగలుగుతున్నారన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ కంపెనీలలో పెట్రోల్ డీజిల్ అవసరాల మేరకు నిల్వలతో సిద్దంగా ఉన్నాయని తెలిపారు. బంకులలో ఆయిల్ అయిపోయిన రెండు గంటలలోపే ట్యాంకర్లతో ఆయిల్ సరఫరా చేసేలా మోనిటరింగ్ చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి, అవసరానికి తగినంత మాత్రమే ఇంధనం కొనుగోలు చేయాలని సూచించారు.

## ఇంధనాన్ని పక్కదోవ పట్టించే వారిపై చర్యలు

అమరావతి,ఏప్రిల్28 ఇంధనాన్ని పక్కదోవ పట్టించే వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ఆదేశాలు ఇచ్చారు. పెట్రోల్ బంకుల్లో ఇంధన నిల్వలు ఉన్నా సరే.. లేదని వాహనదారులకు చెబుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంధన సమస్యపై మంత్రి నాదెండ్ల మనోహర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. వినియోగదారుల సేవా కేంద్రం టోల్ ఫ్రీ నంబర్ 1967కు వచ్చిన ఫిర్యాదుల్లో అధిక భాగం పెట్రోల్ బంకులు ఇంధనం ఇవ్వడం లేదని వస్తున్నాయన్నారు. ఈ ఫిర్యాదులపై జిల్లావారీగా రిపోర్టులు సేకరించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో పెట్రోల్ బంకుల మూసివేతలు క్రమంగా తగ్గుతున్నాయని మంత్రి తెలిపారు. ఆయిల్ కంపెనీల నుంచి డిస్పాచ్‌లు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. వస్తున్న లోడ్లు వాహనదారులకు పూర్తిస్థా యిలో అందేలా చొరవ తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. ఆక్వా రైతులు ప్రస్తుతం కీలక సమయంలో ఉన్నారని.. వారికి ఏ పరిస్థితుల్లోనూ ఇంధన కొరత రాకుండా చూడాలని తెలిపారు. రబీ పంట



కోతల సమయంలో కూడా రైతులకు ఆయిల్ సకాలంలో అందేలా వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయం చేసుకొని పని చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా ఇబ్బంది ఏర్పడితే ఉన్నతాధికారులు వెంటనే స్పందించేలా ఏర్పాట్లు చేయాలని, సోషల్ మీడియాలో అనవసరమైన పుకార్లు వ్యాప్తి చేసేవారిపై నిఘా ఉంచాలని సూచనలు చేశారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. పరిస్థితి పూర్తిస్థాయిలో అదుపులోకి వచ్చే వరకు నిరంతర సమీక్ష, సమన్వయం అవసరమని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

-----------

## లారీని ఢీకొన్న స్లీపర్ బస్సు

ముగ్గురు వ్యక్తులకు గాయాలు

విశాఖపట్టణం,ఏప్రిల్ 28 ఎస్ రాయవరం మండలం అడ్డురోడ్డు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆగి ఉన్న లారీని ప్రైవేట్ స్లీపర్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్తున్న బస్సు అడ్డురోడ్డు వద్దకు చేరుకున్న సమయంలో వంతెనపై నిలిచి ఉన్న లారీని, బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ముగ్గురు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం ఒక పక్క పూర్తిగా దెబ్బతింది. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై రమేష్ తెలిపారు.

## 42శాతంతో జడ్పీటిసి, ఎంపిటిసి ఎన్నికలు

హైదరాబాద్,ఏప్రిల్ 28 రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను 42 శాతం బీసీ రిజర్వేషన్లతోనే నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బిజెపికి చెందిన రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య సోమవారం లేఖ రాశారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి బీసీ వ్యతిరేక వైఖరిని మార్చుకుని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల వాగ్దానం ప్రకారం 42శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలని సూచించారు. ప్రభుత్వం బీసీలను అణచివేసేందుకు ప్రయత్నించిన ప్పటికీ పంచాయతీ ఎన్నికలలో 53శాతం,

మున్సిపల్‌లో 68 శాతం బీసీలు గెలిచి సత్తా చాటారని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్లపై కోర్టులో ఉన్న స్టేను ఎత్తివేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఎంను ఆయన కోరారు




## ఇలాగైతే కంపెనీలు మూసేయాల్సిందే

న్యూఢిల్లీ: విమాన ఇంధనం (ూఖీ) ధరలు విపరీతంగా పెరగడం వల్ల భారత విమానయాన సంస్థలు నిర్వహణా భారంతో కుదేలవుతున్నాయి. ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నాయి. కేంద్రం ఆదుకోకుంటే కంపెనీలు మూసివేయడమో, ఆపరేషన్లు నిలిపివేయడమో మినహా మరో మార్గం లేదని అంటున్నాయి. ఎయిర్ ఇండియా, ఇండిగో, స్పైస్‌జెట్ వంటి ప్రధాన విమానాయాన సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎయిర్‌లైన్స్ (ఖీూ) ఈమేరకు సివిల్ ఏవియేషన్ కార్యదర్శికి తాజాగా లేఖ రాసింది. ఎయిర్‌లైన్స్ ఆపరేషన్లు కొనసాగించాలంటే కేంద్రం తక్షణ ఉపశమన చర్యలు చేపట్టాలని కోరింది.

అసాధారణ రీతిలో పెరిగిపోతున్న జెట్ ఇంధనం ధరలతో దేశీయ, అంతర్జాతీయ ఎయిర్‌లైన్స్ ఆపరేషన్లు అసాధ్యంగా, అస్థిరంగా మారుతున్నాయని ఎఫ్ఐఏ ఆందోళన వ్యక్తం చేసింది. భారత విమానయాన సంస్థలు తీవ్రమైన ఆర్థిక ఒత్తిళ్లకు గురవుతున్నాయని తెలిపింది. తక్షణం ప్రభుత్వం సాయం అందకుంటే కంపెనీలు మూతపడడటం కానీ, ఆపరేషన్లు నిలిపివేయడం కానీ అనివార్యం కావచ్చని పేర్కొంది.

## బంగారం ధరలు తగ్గాయి..
## ప్రస్తుతం ఎలా ఉన్నాయంటే..




డాలర్ కాస్త బలపడడం, గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం వంటి కారణాలతో మంగళవారం బంగారం ధర తగ్గుదల నమోదు చేసింది. భౌగోళిక, అంతర్జాతీయ రాజకీయ కారణాలతో కాస్త హెచ్చుతగ్గులకు లోనవుతోంది.
గుడ్ న్యూస్.. బంగారం ధరలు తగ్గాయి.. ప్రస్తుతం ఎలా ఉన్నాయంటే..డాలర్ కాస్త బలపడడం, గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ తగ్గడం వంటి కారణాలతో మంగళవారం బంగారం ధర తగ్గుదల నమోదు చేసింది. భౌగోళిక, అంతర్జాతీయ రాజకీయ కారణాలతో కాస్త హెచ్చుతగ్గులకు లోనవుతోంది. మంగళవారం ఉదయం పది గంటల సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.710 మేర తగ్గుదల నమోదు చేసింది
గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్, విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,000గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,250గా ఉంది. నిన్నటి ధరతో పోల్చుకుంటే రూ.650 మేర తగ్గింది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,53,150గా, 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,40,400గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గుదలను నమోదు చేశాయి (ౕాఱశ్రీజవతీ జూతీఱఎవం ˉశీఝఎ). కిలోకు 4 వేల రూపాయల మేర తగ్గాయి. ప్రస్తుతం హైదరాబాద్, విజయవాడలో కిలో వెండి ధర రూ.2.65 లక్షలుగా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2.6 లక్షలుగా ఉంది. అలాగే చెన్నైలో కిలో వెండి ధర రూ.2.65 లక్షలుగా, బెంగళూరులో రూ.2.60 లక్షలుగా ఉంది.

# అధిక వేడి తగిలేలా తేనెను ఉపయోగిస్తున్నారా..
## అయితే ఇది తెలుసుకోండి..



తేనె ఆరోగ్యానికి మంచిదనే భావన చాలా మందిలో ఉంది. సహజమైన మధుర పదార్థంగా చక్కెరకు ప్రత్యామ్నాయంగా దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. అయితే తేనెను ఎలా ఉపయోగిస్తామన్నదే దాని ప్రయోజనాలను నిర్ణయిస్తుందని పోషకాహార నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తేనె సాధారణంగా సురక్షితమైన ఆహార పదార్థమే. శతాబ్దాలుగా దీన్ని ఆహారంలో భాగంగా ఉపయోగిస్తున్నారు. కానీ దీనిని వేడి చేసే విధానం, నిల్వ చేసే విధానం వంటి అంశాలు దాని పోషక విలువలపై ప్రభావం చూపుతాయని నిపుణులు చెబుతున్నారు.

అధిక వేడికి గురికావద్దు..
తేనెను మోస్తరు ఉష్ణోగ్రత వద్ద వాడడం పెద్ద సమస్య కాదు. సాధారణ వంటకాలలో లేదా గోరువెచ్చని పదార్థాల్లో కలిపితే హానికరం కాదు. కానీ అధిక ఉష్ణోగ్రత వద్ద వేడి చేస్తే సమస్యలు మొదలవుతాయి. అధిక వేడి వల్ల తేనెలో ఉండే సహజ ఎంజైమ్స్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు క్రమంగా నశించిపోతాయి. సుమారు 40 డిగ్రీల సెల్సియస్‌కి పైగా ఉష్ణోగ్రతలకు తేనెను గురి చేస్తే థర్మల్ డీగ్రడేషన్ అనే ప్రక్రియ ప్రారంభమవుతుందని నిపుణులు చెబుతున్నారు. అంటే తేనె నిర్మాణం మారి, దాని గుణాత్మక విలువ తగ్గిపోతుంది. ఫలితంగా రుచి, వాసన, రంగు కూడా మారే అవకాశం ఉంటుంది.
సరిగ్గా ఉపయోగించాలి..అందువల్ల తేనెను సరిగ్గా ఉపయోగించడం అలవాటు చేసుకోవాలి. తేనెను సరిగ్గా వాడడానికి కొన్ని సులభమైన సూచనలను కూడా నిపుణులు తెలియజేస్తున్నారు. మరిగిన నీటిలో కాకుండా గోరువెచ్చని నీటిలో తేనె కలపడం మంచిది. వంట పూర్తయ్యాక ఆహారంపై తేనెను జోడించడం ఉత్తమం. అలాగే తేనెను మళ్లీ మళ్లీ వేడి చేయడం నివారించాలి. వంటలో ప్రధాన పదార్థంగా కాకుండా చివర్లో జోడించే పదార్థంగా వాడితే దాని ప్రయోజనాలు మెరుగ్గా లభిస్తాయి. తేనె హానికరం కాదు. కానీ దాన్ని ఎలా వాడుతున్నామన్నదే కీలకం. సరైన విధంగా ఉపయోగిస్తేనే దాని సహజ ప్రయోజనాలను పూర్తిగా పొందగలమని నిపుణులు సూచిస్తున్నారు.

# పప్పు దినుసులను తిన్నాక అజీర్తి వస్తుందా.. అయితే కారణం ఇదే..



శాకాహారులు ప్రోటీన్ల కోసం ఎక్కువగా పప్పు దినుసులపై ఆధారపడతారు. అయితే శాకాహార ప్రోటీన్లు తిన్న తర్వాత కొందరికి జీర్ణ సమస్యలు ఎదురవుతుంటాయి. దీనికి కారణం ప్రోటీన్ కాదు, వాటిని సరిగ్గా సిద్ధం చేయకపోవడమేనని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. బీన్స్, పప్పులు, శనగలు వంటి దినుసులను వండే ముందు కొన్ని గంటలు లేదా రాత్రంతా నానబెట్టడం చాలా ముఖ్యమని వారు సూచిస్తున్నారు. శాకాహార ప్రోటీన్లు సాధారణంగా ఫైబర్ ఎక్కువగా ఉండటం, సంక్లిష్ట నిర్మాణం కలిగి ఉండటం వల్ల జీర్ణం కావడానికి కొంచెం సమయం పడుతుంది. వీటిలో ఉండే ఫైటేట్స్ (ఫ్రాష్ఫ్మేవం), ఎంజైమ్ ఇన్హిబిటర్స్ అనే పదార్థాలు జీర్ణ ప్రక్రియను మందగింపజేస్తాయి. అందుకే సరైన విధంగా సిద్ధం చేయకపోతే గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి.
నానబెట్టడమే పరిష్కారం..ఇక ఈ సమస్యకు సులభమైన పరిష్కారం నానబెట్టడమే. పప్పు దినుసులను నీటిలో నానబెట్టినప్పుడు వాటిలోని ఫైటేట్స్ క్రమంగా తగ్గుతాయి. అలాగే ఎంజైమ్స్ యాక్టివేట్ అవుతూ జీర్ణానికి సహాయపడతాయి. దీంతో వండిన తర్వాత అవి తేలికగా జీర్ణమవుతాయి. శరీరానికి అవసరమైన పోషకాలు సులభంగా గ్రహించబడతాయి. జీర్ణ సమస్యలకు అసలు కారణం శాకాహార ప్రోటీన్లు కావు, వాటిని నానబెట్టకపోవడమే అని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. కాబట్టి బీన్స్, పప్పులు, శనగలు వండే ముందు తప్పనిసరిగా కొన్ని గంటలు నానబెట్టడం అలవాటు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.
నువ్వులను కూడా..ఇక నువ్వుల గింజలను (ూవఝఎవ ంవవసం) రోజువారీ ఆహారంలో చేర్చుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఇవి కాల్షియం, ఐరన్, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్ల వంటి కీలక పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఎముకల బలాన్ని పెంచడమే కాకుండా, మెదడు ఆరోగ్యం, గుండె ఆరోగ్యం మెరుగుపడటానికి కూడా సహాయపడతాయి. సరైన విధంగా ఆహారాన్ని సిద్ధం చేసుకోవడం ద్వారా జీర్ణ సమస్యలను నివారించవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.



## ఏయే స్నాక్స్‌ను తింటే ఎంత దూరం వాకింగ్ చేయాలి. . లెక్క నిర్ణయించుకోకపోతే కష్టమే..

జంక్ ఫుడ్ అంటే ఇష్టం లేని వారు ఉండరనే చెప్పవచ్చు. జంక్ ఫుడ్ ను ఇష్టపడకుండా ఉండడం కష్టంగానే ఉంటుంది. సమోసా, వడా పావ్, మోమోస్ వంటి రుచికరమైన పదార్థాలు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. అయితే వీటిని తినడం వల్ల శరీరంపై పడే ప్రభావాన్ని అర్థం చేసుకుని సమతుల్యం పాటించడం చాలా ముఖ్యమని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. పోషకాహార నిపుణుల ప్రకారం, భోజనం తినడం కేవలం కొన్ని నిమిషాల్లో ముగిసిపోతుంది. కానీ ఆ ఆహారం వల్ల వచ్చే కాలరీల ప్రభావం శరీరంలో గంటల తరబడి కొనసాగుతుంది.
ముఖ్యంగా దేశంలో చాలా మంది రోజుకు 5వేల అడుగులు కూడా నడవడం లేదు. అయితే స్నాక్స్ తిన్నప్పటికీ తినే ఆహారాలకు అనుగుణంగా శారీరక శ్రమ ఉంటే ఆరోగ్యంపై పడే దుష్ప్రభావాలను అడ్డుకోవచ్చని వైద్యులు తెలియజేస్తున్నారు.

ఒక సమోసా తింటే 6వేల అడుగులు నడవాలి..

అందరూ ఎంతో ఇష్టంగా తినే సమోసా గురించి చెప్పాలంటే, ఒక సమోసాలో సుమారు 262 కాలరీలు ఉంటాయి. వీటిని ఖర్చు చేయాలంటే దాదాపు 6వేల అడుగులు నడవాలి, అంటే సుమారు ఒక గంట సమయం పడుతుంది. అలాగే వడా పావ్‌లో సుమారు 320 కాలరీలు ఉండగా, వాటిని బర్న్ చేయడానికి సుమారు 70 నిమిషాలు లేదా 7వేల అడుగులు నడవాల్సి ఉంటుంది. మోమోస్ కూడా తేలికగా కనిపించినా, ఒక ప్లేట్‌లో దాదాపు 360 కాలరీలు ఉంటాయి. వీటిని తగ్గించాలంటే 7,500 అడుగులు లేదా సుమారు 75 నిమిషాల శారీరక శ్రమ అవసరం. పానీ పూరీలో సుమారు 200 కాలరీలు ఉండగా, వీటిని బర్న్ చేయడానికి 40 నిమిషాలు లేదా 4వేల అడుగులు నడవాలి.
ఆహారాలను తినండి, క్యాలరీలను ఖర్చు చేయండి..

అలాగే అలూ బర్గర్‌లో దాదాపు 450 కాలరీలు ఉంటాయి. వీటిని ఖర్చు చేయాలంటే 1.5 గంటల పాటు శారీరక శ్రమ అవసరం. చోళే భటూరే అయితే ఇంకా ఎక్కువ. సుమారు 600 కాలరీలు ఉండి, వాటిని పూర్తిగా బర్న్ చేయడానికి దాదాపు 2 గంటలు లేదా 12వేల అడుగులు నడవాల్సి ఉంటుంది. ఇక సాధారణ పరిమాణంలో ఉన్న పిజ్జా అయితే, దాని క్యాలరీలను ఖర్చు చేయడానికి రోజులో సగం సమయం వరకు శారీరక శ్రమ అవసరం అవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే ఈ ఆహారాలను పూర్తిగా మానేయాలని కాదు, కానీ అవి శరీరంపై చూపే ప్రభావాన్ని తెలుసుకుని నిర్ణయం తీసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. సమోసా తినాలనిపిస్తే తినండి. కానీ దాన్ని తినడం వల్ల వచ్చే క్యాలరీలను ఎలా కరిగించాలో కూడా ఆలోచించండి.. అని వారు సూచిస్తున్నారు.